దారులన్నీ సమ్మిట్ వైపు

- అతిథులకు 'తూర్పున' అడుగడుగునా స్వాగతం
- జీఐఎస్‌కు సిద్ధమైన ఏయూ మైదానం


సమ్మిట్‌కు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేస్తున్న స్వాగత ద్వారం, ఫ్లెక్సీలు


సదస్సు ఏర్పాట్లను ఆసక్తిగా తిలకిస్తున్న యువత


అలంకరణకు కడియం నుంచి తీసుకొచ్చిన మొక్కలు

ఏయూ క్యాంపస్: విశాఖ నగరంలో దారులన్నీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(పెట్టుబడిదారుల సదస్సు) వైపు పయనిస్తున్నాయి. శుక్రవారం నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా జరగనున్న జీఐఎస్ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. గత 15 రోజులుగా జరుగుతున్న పనులు దాదాపు పూర్తికావచ్చాయి. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన కార్యక్రమం జరిగే వేదికతో పాటు ఇతర ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దారు. అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు, భారతీయ వ్యాపార దిగ్గజాలు హాజరు కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం నుంచి ఆయన ప్రాంగణం మొత్తం కలియ తిరుగుతూ ఏర్పాట్లు వేగవంతం చేస్తూ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆత్మీయ స్వాగత ఏర్పాట్లు

సమ్మిట్‌కు హాజరయ్యే అతిథులను ఆత్మీయ స్వాగతం పలుకుతూ ఏర్పాట్లు చేస్తున్నారు. సిరిపురం కూడలి నుంచి పెదవాల్తేరు వరకు, సదస్సు జరిగే ఏయూ మార్గంలో రహదారిపై స్వాగతం పలుకుతూ ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మూడో పట్టణ పోలీసు స్టేషన్ నుంచి, మద్దిలపాలెం కూడలి నుంచి ఏయూకు వెళ్లే మార్గాలలో రెండు భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వద్దనున్న మరో ప్రవేశ మార్గం వద్ద కూడా భారీ స్వాగత ద్వారం పెట్టారు. అడ్వాంటేజ్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ఏర్పాటు చేస్తున్న ఈ ఫ్లెక్సీలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

అలంకరణకు కడియం మొక్కలు

సభా వేదికతో పాటు సదస్సు జరిగే ఇతర ప్రాంగణాలలో అలంకరణకు ప్రత్యేకంగా కడియం నుంచి మొక్కలు తీసుకువచ్చారు. వివిధ పక్షులు, జంతువుల ఆకారాలలో తీర్చిదిద్దిన ఈ మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అధికారులు సూచించిన విధంగా వీటిని సభా ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశారు.

దుమ్మురేగకుండా ప్రత్యేక చర్యలు

మైదానంలో దుమ్ము రేగకుండా మొత్తం గ్రీన్ కార్పెట్ పరుస్తున్నారు. సమావేశ ప్రాంగణంలో ఎక్కడా దుమ్ము, ధూళి లేవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా గ్రీన్ కార్పెట్‌ను మైదానంలో వేసే పనిలో కార్మికులు నిమగ్నమయ్యారు.

క్లుప్తంగా

శ్రీకాకుళం వెళ్లి పెన్షన్ అందజేత


సరస్వతికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్, కల్యాణ్ తదితరులు

ఎంవీపీ కాలనీ: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు వలంటీర్ అక్కడికి వెళ్లి పెన్షన్ అందజేశారు. మూలపాలెం ప్రాంతానికి చెందిన కుదన సరస్వతి ఇటీవల తన కుమారుడిని చూసేందుకు శ్రీకాకుళం వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆమె కొద్ది రోజులుగా శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిడి కల్యాణ్ చొరవతో స్థానిక వలంటీర్ హిందు, ఉమ్మిడి కల్యాణ్ శ్రీకాకుళం వెళ్లి ఆమెకు పెన్షన్ అందజేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువతీ యువకులు

బీచ్ రోడ్డు: పర్యావరణ పరిరక్షణ కోసం అందరం కలసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని నినదిస్తూ గురువారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గ్లోబల్ క్లైమేట్ స్ట్రైక్ పేరుతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెట్ల నరికివేత, జంతు హింస, ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం వల్ల వాతావరణం కాలుష్యమై పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు.

తీరంలో స్వచ్ఛ భారత్


తీరంలో శుభ్రం చేస్తున్న యువత

బీచ్ రోడ్డు: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని యువతీ యువకులు గురువారం సాగరతీరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో ఉన్న చెత్తను సేకరించి జీవీఎంసీ సిబ్బందికి అప్పగించారు.

సమస్యలపై గళమెత్తుతా..: ఎమ్మెల్సీ అభ్యర్థి గంటి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గంటి రవికుమార్

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే సమస్యలపై గళమెత్తుతానని గంటి రవికుమార్ తెలిపారు. పిఠాపురం కాలనీలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర సమస్యలపై ప్రశ్నించడానికి తనకు మద్దతు ఇవ్వాలన్నారు.

అప్పన్న సన్నిధిలో ఉన్నతాధికారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్ వలవన్, ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సృజన గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. వీరి పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ చేశారు.

కళలతో సమాజంలో గుర్తింపు


బాలురు ప్రదర్శించిన నాటికను తిలకిస్తున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ: కళలు సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తాయని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. దీన్‌దయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు నవరస మూర్తి బాలురకు నెల రోజుల పాటు నటనలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 'తప్పు తెలిసింది' నాటికను బులికృష్ణ ఆసక్తిగా తిలకించారు. అనంతరం నటనలో తర్ఫీదు పొందిన బాలురకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతైనా అవసరమన్నారు. నటనలో శిక్షణ పొందిన విద్యార్థులు మంచి సందేశాత్మకమైన నాటిక ప్రదర్శించారని అభినందించారు. చెడు స్నేహంతో ఎలాంటి దుష్పరిణామాలు ఎదురయ్యాయో అనే సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారన్నారు. శిక్షణ ఇచ్చిన అసోసియేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, అతిథులు తలసాని కృష్ణప్రసాద్, అబ్దుల్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి


పట్టణ ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు, బయోమెట్రిక్ వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. పీఎం పాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో రిజస్టర్లు తనిఖీ చేశారు. మందుల నిల్వను పరిశీలించారు. గర్భిణులకు ప్రయాణ సదుపాయం కల్పించాలని, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు శశిభూషణ్, బి.నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


రాధాకృష్ణారెడ్డి

ఎంవీపీ కాలనీ: ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ తాళలేక పొలగాం రాధాకృష్ణారెడ్డి(36) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మద్దిలపాలెం కేఆర్‌ఎం కాలనీలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ కాలనీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రపురం, పసలపూడి గ్రామానికి చెందిన రాధాకృష్ణారెడ్డి భార్య దుర్గాభవానితో కలిసి కొన్నేళ్లుగా విశాఖ నగరం మద్దిలపాలెం కేఆర్‌ఎం కాలనీలో ఉంటూ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు కారణంగా అప్పుల బారిన పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం భార్య లేచిచూసే సరికి వంటగదిలో ఉరి వేసుకుని చనిపోయి కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యుల సమాచారంతో ఎంవీపీ ఎస్‌ఐ ఎం.శ్రీను తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి హెచ్‌సీ ఎం.సుధాకర్‌కు దర్యాప్తు నిమిత్తం అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రేమ విఫలమవుతుందేమోనని..

బీచ్ రోడ్డు: తన ప్రేమ ఎక్కడ విఫలం అవుతుందోనని మనస్థాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చినవాల్తేరు తమిళి వీధికి చెందిన సయ్యద్ మోహిద్దీన్ నాలుగేళ్లుగా ఓ హిందూ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ ఏడాది ఉద్యోగం వచ్చి జీవితంలో సెటిల్ కావడంతో మోహిద్దీన్ తన ప్రేమ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపాడు. వారు గత నెల 25న యువతి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయితే మోహిద్దీన్ తండ్రి అప్పుడే పెళ్లి వద్దని, కొంత కాలం ఆగాలని సూచించాడు. దీంతో తనకు ఎక్కడ ఆ అమ్మాయి దూరం అవుతుందోనని మనస్థాపం చెందిన మోహిద్దీన్ అదే రోజు ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న ఆయనను రామ్‌నగర్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

పైడిమాంబకు వార్షికోత్సవ పూజలు


ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు

ఆరిలోవ: ఆదర్శనగర్ దరి డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 7వ తేదీ వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 7న ప్రధాన జాతర జరగనుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల రామలక్ష్మణ్ తెలిపారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


పట్టభద్రుడిని ఓటు అభ్యర్థిస్తున్న గొలగాని శ్రీనివాస్


22వ వార్డులో ప్రచారం చేస్తున్న అక్కరమాని


15వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి

ఆరిలోవ/బీచ్ రోడ్డు/మద్దిలపాలెం/ఎంవీపీ కాలనీ: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, సీపీఎం, బీజేపీ పార్టీలు తమ మద్దతు అభ్యర్థుల తరఫున విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. గురువారం పదో వార్డులో మాజీ కార్పొరేటర్ జగ్గపల్లి అప్పలరాజు, 11వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని పట్టభద్రులను కోరారు. 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని వివేకానందనగర్‌లో ఓ దివ్యాంగ పట్టభద్రుడి ఇంటికి వెళ్లి ఓటేయాలన్నారు.

- ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆరిలోవ ప్రాంతం 12వ వార్డు బీటీఆర్ నగర్‌లో కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, సూర్యరావు, శ్రీనివాస్, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

– జీవీఎంసీ 22వ వార్డులో పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఆధ్వర్యంలో అక్కరమాని విజయనిర్మల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

- ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ తరఫున 16వ వార్డులో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, మీసాల ప్రదీప్, బుగత మధు, రాంబాబు పాల్గొన్నారు.
- సీతంరాజుకు మద్దతుగా జీవీఎంసీ 15వ వార్డులో వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అద్దాల కృపాజ్యోతి విస్తృత ప్రచారం చేశారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో పార్టీ నాయకులు పీలా వెంకట్, బుగత ఏసురత్నం, ఆర్జీ వెంకట లక్ష్మి , గొలగాని త్రినాథ్ పాల్గొన్నారు.
- ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ఎంవీపీ కాలనీలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులకు రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కె.రామారావుగౌడ్, డాక్టర్ వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ఆరిలోవ: జాతీయ జంతు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం చినగదిలిలో పశు వైద్య సిబ్బంది పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. చినగదిలి ప్రాంతంలో 120 పశువులకు ఈ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యశాఖ చినగదిలి మండలం ఏడీ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు జాతీయ జంతు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలో అన్ని పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. నాలుగు నెలల వయస్సు ఉన్న దూడ నుంచి ఈ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

మర్యాద పూర్వక కలయిక


సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్


సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అక్కరమాని


ముఖ్యమంత్రితో ఆడిటర్ జీవీ

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు గురువారం నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమానాశ్రయంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ప్రముఖ ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు(జీవీ) రాడిసన్ బ్లూ హోటల్‌లో ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఏయూ సమాచారమ్

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ


మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వర్సిటీ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. తెలుగు విభాగాధిపతి అప్పారావు మాట్లాడుతూ వర్సిటీ అసెంబ్లీ హాల్‌లో నిర్వహించే ఈ వేడుకలో విశిష్ట మహిళలను సన్మానిస్తామన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ స్కూల్ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ప్రకృతి ధర్మమైన గొలుసు కట్టు విధానంలో మనిషి, భూగోళం మనుగడకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపకుడు జేవీ రత్నం అన్నారు. మార్చి 3న 50వ వన్యప్రాణి దినోత్సవ నినాదాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్, ఏఎస్ రాజా మహిళల జూనియర్ కళాశాల, శివాజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'వన్యప్రాణుల సంరక్షణ కోసం భాగస్వాములు కండి' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భూమి మీద ఉన్న వన్యప్రాణులు, మొక్కలు భూమి మనుగడకు, మనిషి ఆరోగ్య పరిరక్షణకు ఎలా కారణమవుతున్నాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని మెడగాస్కర్, ఏఎస్ రాజా కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, శివాజీపాలెం జీవీఎంసీ స్కూల్ హెచ్‌ఎం బీకేడీ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వన్యప్రాణి సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు.

బాలల హక్కులు, సమస్యలపై పోరాటం

ఎంవీపీ కాలనీ: బాలల సమస్యలు, హక్కులపై జాతీయ స్థాయిలో పోరాడతామని సీబీఐ మాజీ జేడీ, సీఆర్పీఎఫ్ జాతీయ సలహాదారు వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. సీఆర్పీఎఫ్ జాతీయ సలహాదారుగా ఇటీవల నియమితులైన ఆయనను ఆలిండియా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సౌత్ జోన్ రాష్ట్రాల కన్వీనర్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం ఎంవీపీ కాలనీలోని జరిగిన కార్యక్రమంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ జనాభాలో 40 శాతం పైగా ఉన్న బాలలకు ప్రాథమిక హక్కులు కల్పించి, ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు సమాజంపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం విశాఖ నగర కన్వీనర్ కె.ఎల్లయ్య, అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ డాక్టర్ బి.లవకుశ, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్నుపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బాలకృష్ణ

మద్దిలపాలెం: ఆదాయపు పన్ను విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఆదాయ పన్నుల శాఖ బాలకృష్ణ అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో గురువారం మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ హాల్‌లో స్వచ్ఛంద సంస్థలు, దేవదాయ శాఖాధికారులు, విద్యార్థులతో అవగాహన, అవుట్ రీచ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఆదాయ పన్నుల శాఖ కొన్నింటికి మినహాయింపు ఇచ్చిందన్నారు. నూతనంగా చట్టంలో వచ్చిన మార్పులను వివరించారు. పన్నుల రూపంలో సేకరించిన సొమ్మును ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తారని చెప్పారు. పన్నుల చెల్లింపులు సకాలంలో జరగాలన్నారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ యు.రామకృష్ణ ప్రసంగించారు. అనంతరం ఐటీ శాఖ అధికారులు నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కం ట్యాక్స్ జాయింట్ కమిషనర్ వి.కోటేశ్వరమ్మ, రమణమూర్తి, ఏఎస్‌ఎం రెడ్డి పాల్గొన్నారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈ పూజ నిర్వహించారు.

- అప్పన్న స్వామికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.